ప్రజల గళం... ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం... | నిజం కోసం... నిర్భయంగా... | సమాజం . సమగ్ర అభివృద్ధి

# ప్రజానేస్తం జ్వాల

తెలుగు దినపత్రిక

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



WANTED REPORTERS

ALL OVER TELANGANA & ANDHRA PRADESH

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

Chenagani Purushotham 9603068864



గ్రేటర్ వరంగల్ ప్రజావాణికి 73 దరఖాస్తులు 2



అక్టోబర్ 13 మంగళవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 6 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

TUESDAY OCTOBER 13 2026 | VOL:1 | ISSUE: 6 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM


# ఎన్నికల్లో ఓటమి భయంతోనే మోదీ సర్కార్ 'సర్' ను అమలు చేస్తోంది.. సీఎం ధ్వజం

ఢిల్లీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (౧వశ్రీఖఅస్త్రుఱు జవీ =వఝుత్ష్ట్ర =వ౧౧౧) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్రలో సర్ (ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) ఎక్కడ తీసేశారో అక్కడ బీజేపీ గెలుస్తోందని ధ్వజమెత్తారు. మతాలు, ప్రాంతాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతోందని దుయ్యబట్టారు. మనుగడ లేని రాష్ట్రాల్లో ఇతర పార్టీలు గెలుస్తున్నాయని వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. సీఈసీ ఎంపికలో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిని తొలగించారని ప్రస్తావించారు. ఈరోజు (సోమవారం) ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

2014లో 81 కోట్ల ఓట్లు వచ్చాయని.. 2019లో 91 కోట్ల ఓట్లు, 2023లో 97 కోట్ల ఓట్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారని, ఇప్పుడు ఉన్న జనాభా ఎంత అని ప్రశ్నించారు. జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతున్నాయి..? అని నిలదీశారు. ఈ విషయంలో ఎవరు సమాధానం చెబుతారని అడిగారు. రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు కూడా మోదీకి ఈ విషయం గురించి ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నల వర్షం కురిపించారు.





బీజేపీ రెండు వర్గాలను తయారు చేస్తోందని.. అనుకూలం ఉన్న వారికి ఓట్లు, ఇతరులను ఓట్లులేని వారిగా తయారు చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలోని పౌరులను మోదీ సర్కార్ రెండు రకాలుగా విడగొడుతోందని మండిపడ్డారు. ఓటు హక్కు కోల్పోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశంలో శాశ్వత విభజనను బీజేపీ తీసుకొస్తోంది..

దేశంలో శాశ్వత విభజనను బీజేపీ తీసుకొస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. సీఈసీపై మరో స్వతంత్ర పోరాటం జరుగుతోందని

(మిగతా 2వ పేజీలో..)

## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన.. చార్జీల తగ్గింపుకు కసరత్తు

### త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం

### ధరలు భారంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు

హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.



## రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్.. టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

### రేడియల్ రోడ్ టెండర్లలో అవకతవకలంటూ రాజగోపాల్ రెడ్డి ఆరోపణ

### రూ.600 కోట్లు తక్కువకు బిడ్ వేసినా తమను తప్పించారని మండిపాటు

### సీఎం రేవంత్ శాఖలోనే దోపిడీ జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే



## 'ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది'.. నిరసన వేదిక గుర్తింపు రద్దుపై అభిజీత్ దిప్కే

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ హోదాను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందించారు. ఇప్పుడు దేశమంతా 'జంతర్ మంతర్' అవుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'వారు (కేంద్రం) జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన స్థలం జాబితా నుంచి తొలగించారు. అవును, అది ఇకపై నిరసన స్థలం కాదు. ఏదేమైనా ఒక పిరికి నియంత దానిని యుద్ధ క్షేత్రంగా మార్చేశారు. ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది' అని అందులో పేర్కొన్నారు. అలాగే, ఈ రోజు జంతర్ మంతర్‌కు ఉన్న 'నిరసన ప్రదేశం' హోదాను ప్రధాని మోదీ రద్దు చేశారని, రేపు ఆయన ప్రజాస్వామ్యాన్నే రద్దు చేస్తారని మరో పోస్ట్‌లో మండిపడ్డారు. 'ఆ నియంతకు అసలు సమస్య నిరసన ప్రదేశం కాదు. ప్రజలు నిరసన తెలపడం అనే భావనే ఆయనకు సమస్య' అని విమర్శించారు. కాగా, జంతర్ వ ం ం త ఁ ం ్ న ం నిరసనలకు నిర్దేశిత ప్రదేశంగా గుర్తించే



(మిగతా 2వ పేజీలో..)

## 200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు.. రాహుల్ సంచలన వ్యాఖ్యలు

### జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపుతున్నారని రాహుల్ వెల్లడి

### అప్రూవర్‌గా మారాలని జ్ఞానేశ్‌కు రాహుల్ సూచన

### మోదీ, అమిత్ షా, దోవల్, అదానీ కలిసి ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు

### జ్ఞానేశ్ అసలు నేరస్థుడు కాదని.. సూత్రధారులు వేరే ఉన్నారని వ్యాఖ్య

### సీఈసీని తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టీకరణ

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. "మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు



(మిగతా 2వ పేజీలో..)

## సింగూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి: హరీశ్ రావు

**హైదరాబాద్, అక్టోబర్ 12:**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడానికి కాంగ్రెస్‌కు మనసు లేదని మండిపడ్డారు. పంటలు వేయొద్దంటే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతు కూలీలు ఎలా బతకాలి.. వలసలు పోవాలా అని నిలదీశారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు వలసలు వాపస్ వచ్చాయని.. ఇప్పుడు మళ్లీ వలసలు మొదలయ్యాయని విమర్శించారు.రైతులు డీజిల్ ఇంజిన్‌లు పెట్టుకుని పంటలను కాపాడుకుంటున్నారని.. ప్రతి దానికీ ఎల్‌నినోతో లింక్ పెడుతున్నారని

(మిగతా 2వ పేజీలో..)



## ఇది ఓట్ల దొంగతనమే: మంత్రి శ్రీధర్ బాబు

### ఓటర్ల జాబితా సవరణపై ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన

### ఆందోళనలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, నేతలు

### సీఈసీని తొలగించాలని డిమాండ్

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (ా×=) ప్రక్రియకు వ్యతిరేకంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని ఆరోపిస్తూ, సుప్రీంకోర్టు వరకు మార్చ్ చేస్తామని ఈ సందర్భంగా నేతలు హెచ్చరించారు.ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ను అడ్డుపెట్టుకుని, తమకు వ్యతిరేకంగా ఉన్న అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తోందని, ఇది ఓట్ల దొంగతనమేనని తీవ్రంగా విమర్శించారు. ప్రధాన ఎన్నికల

(మిగతా 2వ పేజీలో..)



## పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన

**ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

**ఓట్లు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా మీ ముందుకే తెస్తానన్న పొన్నం**

**ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని రాంచందర్ రావు డిమాండ్**

తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా



(మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

# గ్రేటర్ వరంగల్ ప్రజావాణికి 73 దరఖాస్తులు

**నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి: అదనపు కమిషనర్ జోనా**



**హనుమకొండ (ప్రజానేస్తం జ్వాల):**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర ప్రజల నుంచి మొత్తం 73 వినతిపత్రాలు అందినట్లు అదనపు కమిషనర్ జోనా తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు వివిధ విభాగాలకు దరఖాస్తులు సమర్పించారు. శాఖల వారీగా పరిశీలిస్తే టౌన్ ప్లానింగ్ విభాగానికి అత్యధికంగా 35 దరఖాస్తులు అందాయి. ఇంజినీరింగ్ విభాగానికి 22, ప్రజారోగ్యం--పారిశుద్ధ్య విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 6, తాగునీటి సరఫరా విభాగానికి 4 వినతిపత్రాలు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ జోనా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమకొండ జిల్లా ప్రజావాణికి 225 అర్జీలు

**పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



**హనుమకొండ (ప్రజానేస్తం జ్వాల):**

హనుమకొండ జిల్లాలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం 225 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వీటిలో కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 98 దరఖాస్తులు అందగా, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో 30 అర్జీలు నమోదయ్యాయి. జిల్లాలోని వివిధ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో) కార్యాలయాల్లో మరో 97 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన అర్జీలను ఏ ఒక్కటీ పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. వివిధ శాఖలకు అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చోట క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా, నిర్ణీత కాలపరిమితిలోగా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీదారులకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ ప్రజావాణిపై ప్రజల్లో నమ్మకం పెంపొందించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఎన్నికల్లో ఓటమి భయంతోనే మోదీ సర్కార్ 'సర్' ను అమలు చేస్తోంది.. సీఎం ధ్వజం

మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. జ్ఞానేశ్ గో బ్యాక్ పేరుతో తమ ఆందోళన కొనసాగుతోందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సర్ వ్యతిరేక పోరాటం, మరో స్వతంత్ర పోరాటమేనని.. సైమన్ గో బ్యాక్ పోరాటం లాగే తాము పోరాటం చేస్తామని అన్నారు. ఇన్నాళ్లు సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను ఉపయోగించి ప్రత్యర్థులను అణిచివేశారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలవదనే అభిప్రాయంతో 'సర్'ను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమకు ఓటు వేయని వారి ఓట్లను 'సర్' పేరుతో తొలగిస్తున్నారని ఆగ్రహించారు.

ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారు..

ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మోదీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న యువత ఓట్లను కూడా తొలగిస్తున్నారని ఫైర్ అయ్యారు. మోదీ ఎందుకు జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓట్లను తొలగించి పశ్చిమబెంగాల్, బిహార్, హరియానాలో గెలిచారని ధ్వజమెత్తారు. ఓటు లేకపోతే ఏ పార్టీ పేదలను పట్టించుకోదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# 200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు.. రాహుల్ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి)

ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

సీఈసీ సందేశాలు పంపిస్తున్నారు

జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.

మోదీ, అమిత్ షా ఒత్తిడి ఉందని ఆరోపణ

జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.

సుప్రీంకోర్టుకు ప్రతిపక్ష కూటమి

ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

200 మంది అధికారులు టచ్‌లో

కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలి

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

## 'ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది'.. నిరసన వేదిక గుర్తింపు రద్దుపై అభిజీత్ దిప్కే

మొదటి పేజీ తరువాయి)

హోదాను రద్దు చేస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'కమిటీ సిఫార్సుల ఆధారంగా, నిరసన వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేశారు. నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సీబీడీ మైదానం అనే మూడు కొత్త ప్రదేశాలను నిర్దేశించారు' అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మూడు కొత్త ప్రదేశాలలో నిరసనలు నిర్వహించడానికి సంబంధించిన ప్రామాణిక కార్యనిర్వహణ విధానాలను వేర్వేరుగా జారీ చేస్తామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. మరోవైపు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్) వివాదంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలను ఉధృతం చేశాయి. దీంతో గత రెండు రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అక్కడకు చేరుకుంటున్న నిరసకారులను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పటి వరకు నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ గుర్తింపును రద్దు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

## రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్.. టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

మొదటి పేజీ తరువాయి)

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## సింగూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి మండిపడ్డారు. బొగ్గు లేదంటే కూడా ఎల్‌నినో అంటున్నారన్నారు. సర్కార్ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని విరుచుకుపడ్డారు. దేవాదులలో మోటార్లు ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. సింగూరు ప్రాజెక్ట్‌లో వాడుకునేందుకు రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. ఆ నీళ్లను కూడా బీర్ల కంపెనీలకు ఇస్తున్నారని ఆరోపించారు. దసరా లిక్కర్‌కు షార్టేజ్ రావొద్దని వాళ్లకు నీళ్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యమని ప్రశ్నించారు. సింగూరుపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటని ప్రశ్నించారు. పంటల కోసం జూరాల గేట్లు తెరిస్తే రైతులను జైలుకు పంపారని.. తాగునీరు ఇవ్వకుండా బీర్ల కంపెనీలకు నీళ్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేసులు పెట్టాలని హరీశ్ డిమాండ్ చేశారు. నీళ్లుండి కూడా ఎత్తని ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. రైతులతో గంట సేపు మాట్లాడే సమయం ముఖ్యమంత్రికి లేదా అంటూ ప్రశ్నించారు. బీర్ల కంపెనీలకు నీళ్లు, ఢిల్లీలో రాజకీయాలు తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకో పని లేదని హరీశ్ రావు విమర్శించారు.

## పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన

మొదటి పేజీ తరువాయి)

సవరణలో పేర్ల తొలగింపు అంశంపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ సవాల్ విసిరారు. ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ ప్రక్రియలో పొరపాట్లు జరిగితే సరిదిద్దాల్సింది పోయి, బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. మంత్రి పొన్నం సవాల్‌పై స్పందించిన రాంచందర్ రావు... ఓట్లు తొలగించబడినట్టు చెబుతున్న ఒక 10 మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఫసల్ బీమా యోజనలో చేరాలని ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తంమీద, ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## ఇది ఓట్ల దొంగతనమే: మంత్రి శ్రీధర్ బాబు

మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఈసీని పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హిందుస్థాన్ టైమ్స్, పీటీఐ కథనాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ఓట్లు తొలగించడం దారుణమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 'ఓట్ బచావో, దేశ్ బచావో' నినాదంతో ఈ దేశవ్యాప్త ఆందోళనను కాంగ్రెస్ ఉద్ధృతం చేసింది.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై ఫిర్యాదు

**అర్హులకు అన్యాయం జరిగిందంటూ ఎంపీడీఓకు వినతిపత్రం**

**అనర్హుల ఎంపికపై విచారణ జరపాలి.. వికలాంగ యువకుడు అరవింద్ డిమాండ్**

**గరిడేపల్లి,అక్టోబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):**

సూర్యపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన వికలాంగ యువకుడు మద్దెమడుగు అరవింద్ సోమవారం గ్రీవెన్స్ డేలో మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)కు వినతిపత్రం సమర్పించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించలేదని, రాజకీయ పలుకుబడితో అనర్హులకు ఇళ్లు మంజూరయ్యాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం వికలాంగులకు ఐదు శాతం ఇళ్లు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అర్హులైన వికలాంగులకు ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు ఉండాల్సిన నిబంధనకు విరుద్ధంగా, రూ.3 లక్షలకు పైగా ఆదాయం ఉన్నవారికి, నాలుగు చక్రాల వాహనాలు కలిగినవారికి, నాలుగు ఎకరాలకు పైగా భూమి ఉన్న కుటుంబాలకు కూడా ఇళ్లు కేటాయించారని ఫిర్యాదులో వివరించారు.అర్హతల జాబితాలో ఎల్-3లో ఉన్నవారిని ఎల్-1లోకి మార్చి, నిజమైన నిరుపేదలకు అన్యాయం చేశారని అరవింద్ ఆరోపించారు. అర్హుల ఎంపికపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఎంపికైన వారిని గుర్తించాలని కోరారు.




కలెక్టర్, ఎంపీడీఓ స్పందించాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను సమీక్షించి, అర్హులైన నిరుపేదలు, వికలాంగులకు న్యాయం చేయాలని అరవింద్ అధికారులను కోరారు. ఎంపికలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే ఏసీబీ ద్వారా విచారణ జరిపించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.లబ్ధిదారుల ఎంపికపై వచ్చిన ఆరోపణలపై అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.

# కాకతీయ రాతికోట వద్ద మద్యం సీసాలు కలకలం!

**చారిత్రక కట్టడం పరిసరాల్లో పరిశుభ్రత, భద్రతపై ప్రశ్నలు**

**వరంగల్, అక్టోబర్ 12 ,ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి:**

ఓరుగల్లు చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన కాకతీయ రాతికోట ప్రవేశ ద్వారం సమీపంలో మద్యం సీసాలు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. చారిత్రక కట్టడాన్ని సందర్శించే పర్యాటకులు, స్థానికంగా నడకకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.రాతికోట ప్రవేశ ద్వారం కుడివైపు మద్యం సీసాలు ఉన్నట్లు వీడియోలో కనిపిస్తున్న దృశ్యాలు అక్కడి నిర్వహణ, పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే, ఆ సీసాలను ఎవరు అక్కడ ఉంచారు, అక్కడ మద్యం సేవించారా అనే విషయాలు ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది.

చారిత్రక ప్రదేశాల పరిరక్షణకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయా? ఉంటే అవి సక్రమంగా పనిచేస్తున్నాయా? రాతికోట పరిసరాల్లో పరిశుభ్రత, భద్రతను పర్యవేక్షించేందుకు ఎలాంటి ఏర్పాట్లు ఉన్నాయి? అనే ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.




కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో పాటు పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రాతికోట పరిసరాలను పరిశీలించి, మద్యం సీసాలను తొలగించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.చారిత్రక సంపదను కాపాడటం అందరి బాధ్యత. ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పందించి తీసుకునే చర్యలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది

# కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖలో పదోన్నతులు పొందిన అధికారులకు అభినందనలు

**జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్**

**కుమురం భీమ్ ఆసిఫాబాద్ (ప్రజానేస్తం జ్వాల):**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని వివిధ పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు పదోన్నతులు పొందడం పట్ల జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ హర్షం వ్యక్తం చేస్తూ, వారికి శుభాకాంక్షలు తెలిపారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్ఐ, ఏఎస్ఐ, ఏఆర్ఎస్ఐ స్థాయిలకు అంచెలంచెలుగా ఎదగడం వారి క్రమశిక్షణ, అంకితభావం, విధి నిర్వహణకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారి విధి నిర్వహణ, బాధ్యతలు, అవసరాలపై ఎస్పీ చర్చించి, కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు.దోన్నతి పొందిన అధికారులు:??సుభాష్ మండల్: హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా ముందే ఉద్ధవ్: ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా పి. సారయ్య: హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఆర్ఎస్ఐగాభీంరావు: ఏఎస్ఐ నుంచి




ఎస్ఐగాపదోన్నతులు పొందిన అధికారులు. నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, బాధితులకు న్యాయం చేకూర్చడంలో నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# యాసంగి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం...

**భీమదేవరపల్లి( ప్రజా నేస్తం):**

రైతులకు వ్యవసాయ సాగులో అవసరమైన సూచనలు, సలహాలు అందించేందుకు నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి రైతులకు పలు సూచనలు చేశారు.యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటిస్తూ పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మ, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఏపీఎం, సర్పంచులు మేకల వెంకన్న, గద్ద కుమారస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఏఈఓలు కమలహాసన్, క్రిసోలైట్ , మౌనిక, రైతులు, మహిళా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వాయిదాలకు డుమ్మా.. ఎన్‌బీడబ్ల్యూ వేట!

- హత్య కేసు నిందితుడి అరెస్ట్
- 2023 కేసులో బెయిల్‌పై విడుదలైన సలీం పాషా
- ఎన్‌బీడబ్ల్యూ అమలు.. 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్

**నేరేడుచర్ల, అక్టోబర్ 12(ప్రజానేస్తం జ్వాల):**



నాయనమ్మ హత్య కేసులో నిందితుడిగా ఉన్న షేక్ సలీం పాషా (42)ను నేరేడుచర్ల పోలీసులు అరెస్ట్ చేశారు. 2023లో నమోదైన ఈ కేసులో బెయిల్‌పై విడుదలైన అనంతరం సలీం పాషా కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.దీంతో హుజూర్‌నగర్ కోర్టు నిందితుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. వారెంట్‌ను అమలు చేసిన నేరేడుచర్ల పోలీసులు సలీం పాషాను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో అతడిని హుజూర్‌నగర్ సబ్‌జైలుకు తరలించారు.కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకునే నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ చరమందరాజు తెలిపారు.

## రహదారి బాగు చేసేదెప్పుడు?

**శిలలమయంగా మారిన నిషాని రహదారి!**

**అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.. ప్రజలకు తప్పని ఇబ్బందులు**

**విద్యార్థులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులకు నిత్య అవస్థలు**



**కెరమెరి, అక్టోబర్ 12(ప్రజానేస్తం జ్వాల । మాదవి మనోహర్):**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని నిషాని ఏజెన్సీ గ్రామంలో రహదారి దుస్థితి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారి సౌకర్యం కీలకమైనప్పటికీ.. నిషాని గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా రాళ్లమయంగా మారి ప్రయాణానికి అనుకూలంగా లేకుండా పోయింది.రహదారి మొత్తం పెద్దపెద్ద రాళ్లు, గుంతలతో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఈ మార్గంలో ప్రయాణించాల్సి రావడంతో అవస్థలు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.

ప్రమాదం జరిగాక కాదు.. ముందే స్పందించాలి

మారుమూల ఏజెన్సీ గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడం కూడా అభివృద్ధిలో భాగమేనని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు నిషాని గ్రామ రహదారి పరిస్థితిని వెంటనే పరిశీలించి తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత ప్రాతిపదికన రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మహిళల భద్రతపై అప్రమత్తత అవసరం

**సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి: షీ టీమ్ ఎస్సై రామారావు**

**మహిళలపై నేరాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**దేశాయ్‌పేట లేబర్ అడ్డా వద్ద 70 మంది కార్మికులకు అవగాహనలి**

**వరంగల్, అక్టోబర్ 12 (ప్రజానేస్తం జ్వాల। మారెల్లి కిరణ్):**

సమాజంలో నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వర్తించాలని, అప్రమత్తంగా మెలగాలని వరంగల్ షీ టీమ్ ఎస్సై రామారావు పిలుపునిచ్చారు.ఉమ్మడి వరంగల్ జిల్లా, వరంగల్ వెస్ట్ పోలీస్ పరిధిలోని దేశాయ్‌పేట లేబర్ అడ్డా వద్ద సోమవారం షీ టీమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది కార్మికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలపై జరిగే అత్యాచారాలు, అఘాయిత్యాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై అధికారులు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆపదలో ఉన్న మహిళలు, యువతులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వెంటనే షీ టీమ్స్‌ను లేదా అత్యవసర హెల్ప్‌లైన్ ద్వారా పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

## విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఘనంగా 73వ జన్మదిన వేడుకలు

**తొర్రూర్ కె. మాసిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన సంఘం నాయకులు, సభ్యులు**

**తొర్రూర్, అక్టోబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో తొర్రూర్‌కు చెందిన శ్రీ కె. మాసిరెడ్డి 73వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, సభ్యులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఇట్టే సోమారెడ్డితో పాటు ఏ. కృష్ణారెడ్డి, మన్నూరు కోటయ్య, డి. వెంకటరెడ్డి, సీహెచ్. విజయ్ కుమార్, కలకోట సోమయ్య, డి. బాలాజీ, ఉల్లి విశ్వనాథ చారి, సానిక వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. సంఘానికి చెందిన సుమారు 30 మంది ప్రాథమిక సభ్యులు హాజరై వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

## ఆర్యవైశ్య మహాసభలో తొర్రూరు వాసులకు రాష్ట్రస్థాయి పదవులు

**వజినపల్లి అనిల్ కుమార్‌కు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి.. బిజ్జాల అనిల్ కుమార్‌కు రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు**

**తొర్రూర్, అక్టోబర్ 12 ( ప్రజానేస్తం జ్వాల):**



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో తొర్రూరుకు చెందిన ఇద్దరు ప్రముఖులకు రాష్ట్రస్థాయి పదవులు లభించాయి. మహాసభ విద్యా విభాగం, స్కాలర్‌షిప్స్ వితరణ కమిటీలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీ వజినపల్లి అనిల్ కుమార్‌ను, పొలిటికల్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీ బిజ్జాల అనిల్ కుమార్‌ను నియమించారు. రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షులు ప్రొద్దుటూరి గౌరీశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ వారి చేతుల మీదుగా ఇరువురికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వారు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా సంఘ అధ్యక్షులు తల్లాడ వెంకట రామారావు, కోశాధికారి సామ రామమూర్తి, తొర్రూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్, కోశాధికారి చిదిరాల శ్రీనివాస్, తాటికొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ మాప్‌అప్ ఫేజ్ వెబ్ ఆప్షన్లకు నోటిఫికేషన్ విడుదల

**రూ.20 లక్షల జరిమానా.. మూడేళ్ల పాటు కౌన్సెలింగ్ నుంచి డిబార్**

**హనుమకొండ (ప్రజానేస్తం జ్వాల):**



రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి సంబంధించి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం మాప్‌అప్ ఫేజ్ వెబ్ ఆప్షన్ల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అధికారిక వెబ్‌సైట్ https://tsmedadm.tsche.in/ ద్వారా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి. మాప్‌అప్ ఫేజ్‌లో సీటు కేటాయింపు పొందిన అభ్యర్థులు కళాశాలలో చేరకపోయినా, అడ్మిషన్ పొందిన అనంతరం మధ్యలోనే కోర్సును వదిలేసినా నిబంధనల ప్రకారం రూ.20 లక్షల జరిమానాతో పాటు మూడేళ్లపాటు కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి డిబార్ చేసే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థులు కౌన్సెలింగ్ నిబంధనలను పూర్తిగా పరిశీలించి, సీట్ల ఎంపికపై స్పష్టమైన అవగాహనతో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## రేపు నక్కలగుట్ట ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అంతరాయం**

**హనుమకొండ (ప్రజానేస్తం జ్వాల):**



నక్కలగుట్ట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్‌కు సంబంధించిన పనుల నేపథ్యంలో అక్టోబర్ 13న విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కారణంగా బాలసముద్రం, ఏకశిలా పార్క్, హరిత హోటల్, బారిస్టా జ్యూస్ సెంటర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. విద్యుత్ శాఖ చేపట్టనున్న పనులకు అనుగుణంగా వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు. నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నందున ప్రజలు ఈ విషయాన్ని గమనించి శాఖకు సహకరించాలని విద్యుత్ శాఖ డీఈఈ సాంబరెడ్డి కోరారు.

# నీటి ఎద్దడి దృష్ట్యా ఆరుతడి పంటలనే సాగు చేయాలి

**రైతులకు హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచన**

**హనుమకొండ (ప్రజానేస్తం జ్వాల):**



ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. భూగర్భ జలమట్టాలు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. దామెర రైతువేదికలో నిర్వహించిన 'రైతునేస్తం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ స్థానిక అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంప్రదాయంగా సాగు చేసే అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ఆరుతడి పంటలను ఎంచుకోవడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పెట్టుబడి ఖర్చులను నియంత్రించుకోవచ్చని తెలిపారు. రైతులు పంటల మార్పిడి విధానాలను అనుసరిస్తూ, నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముందస్తు సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తూ, అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సందేహాలు

**భీమదేవరపల్లి మండలంలో రెండో విడత అర్హత పరిశీలన.. జాబితా వెల్లడించాలని డిమాండ్**

**భీమదేవరపల్లి, అక్టోబర్ 12 (ప్రజానేస్తం జ్వాల):**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి రెండో విడత అర్హత పరిశీలన ప్రక్రియను అధికారులు సోమవారం చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన జాబితా మండలానికి చేరినట్లు సమాచారం. తొలి జాబితాలో చోటు దక్కిన కొందరు లబ్ధిదారుల వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే, లబ్ధిదారుల జాబితాను బహిరంగంగా వెల్లడించకపోవడంపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎంపిక ప్రక్రియపై స్పష్టత లేకపోవడంతో అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయంపై గట్లనర్సింగాపూర్ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ స్పందిస్తూ, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడం విచారకరమని అన్నారు. ఎంపిక ప్రక్రియలో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు లబ్ధిదారులను ఎవరు ఎంపిక చేశారు? ఏ ప్రాతిపదికన పేర్లను ఖరారు చేశారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.



ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు అందాలంటే ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని అభిప్రాయపడుతున్నారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం వెల్లడించి, అర్హతలపై స్పష్టత ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తారా? అన్నది వేచి చూడాలి.

## ఆసిఫాబాద్‌లో గంజాయి విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం

**నలుగురి అరెస్ట్.. 150 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం**

**కుమురం భీమ్ ఆసిఫాబాద్ (ప్రజానేస్తం జ్వాల):**



జిల్లాలో గంజాయి అక్రమ కొనుగోలు, విక్రయాలపై పోలీసులు చర్యలు చేపట్టి నలుగురిని అరెస్ట్ చేశారు. ఫారెస్ట్ చెక్‌పోస్ట్, గుండి ఫ్లైఓవర్ వద్ద తనిఖీలు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి 150 గ్రాముల ఎండు గంజాయితో పాటు రూ.7,500 విలువైన మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అరెస్టు చేసిన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌హెచ్ఓ రవి తెలిపారు. అక్రమ మత్తు పదార్థాల కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు.. కలెక్టర్‌కు ఉద్యోగ సంఘాల జేఏసీ ఆహ్వానం

**ఈ నెల 14న వేడుకలు.. మహిళా ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: ఆకుల రాజేందర్**

**హనుమకొండ (ప్రజానేస్తం జ్వాల):**

హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలను ఘనంగా విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని మహిళా ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కలెక్టర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. అలాగే కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని అన్ని విభాగాల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల ముఖ్య నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

